నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | వరంగల్, మంగళవారం 31 డిసెంబర్ 2024 | HANUMAKONDA




వరదకు కొట్టుకుపోయిన డోర్నకల్ మండలంలోని ముల్కలపల్లి బ్రిడ్జి(ఫైల్)

# మానని గాయం

- జలవిలయంతో తల్లడిల్లిన మానుకోట
- రైతన్నలకు అపార నష్టం
- 2024 మిగిల్చిన చేదు జ్ఞాపకం

మహబూబాబాద్, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ): ఈ ఏడాది వరద సృష్టించిన బీభత్సం మానుకోటకు మానని గాయం చేసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జిల్లాను అతలాకుతలం చేసి ఇల్లు, వాకిలి, పంట పొలాలన్నింటినీ తుడిచిపెట్టేసి ప్రజలకు తీరని నష్టం మిగిల్చింది. 75 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఆగస్టు 30, 31, సెప్టెంబర్ 1 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షాలతో మహబూబాబాద్ ఆగమాగమైంది. వరద ఉధృతికి రైలు, రోడ్డు మార్గాలు తెగిపోయి జనజీవనం అస్తవ్యస్తమై జిల్లాతో సంబంధాల లేకుండా పోయాయి. మూడు చోట్ల రైల్వే ట్రాక్ కొట్టుకుపోగా, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు కొట్టుకుపోవడంతో వేలాది ఇళ్లు నేలకూలాయి. వేల ఎకరాల్లో పంట దెబ్బతిని రైతుల భూముల్లోకి ఇసుక మేటలు, రాళ్లు వచ్చి చేరాయి. ఇంట్లో నిత్యావసరాలు, సామగ్రి ఏవీ లేకుండా వరద పాలై తిందామంటే తిండీ లేక, ఉండేందుకు ఇల్లు లేక నరకం చూశారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చి పర్యటించి వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చినా అది పూర్తిస్థాయిలో నెరవేరలేదు. బాధితులకు అరకొర సాయం చేసి చేతులు దులుపుకొన్నారు. మానుకోట జిల్లాను జలప్రళయం ముంచెత్తడంతో ఇబ్బంది పడ్డ ప్రజలకు ఈఏడాది కంటిమీద కునుకు లేకుండా చేసింది. మళ్లీ ఇలాంటి విపత్తు వస్తే మా పరిస్థితి ఏమిటనేది తలుచుకుంటేనే భయంగా ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



మహబూబాబాద్‌లో వరద నీటితో నిండిన అండర్ బ్రిడ్జి

**భయంభయంగా బతికినం..**

నెల్లికుదురు మండలం రావిరాలలో అక్టోబర్ 31 రాత్రి గ్రామంలోకి ఒక్కసారిగా భారీగా వరద వచ్చింది. ఊరు మొత్తం మునిగిపోయింది. ఇండ్లలోకి మస్తు నీళ్లు వచ్చినయ్. బల్లలపై, ఇంటి సజ్జలపై ఉన్నాం. భయంభయంగా బతికినం. గ్రామంలో నాలుగు కుటుంబాలు మమ్ముల కాపాడండి అంటు రాతంత్రా డాబాపై గొడుగులు పట్టుకొని తలదాచుకున్నారు. ఇళ్లన్నీ కూలిపోయినయ్. పంట పొలాలన్నీ మునిగిపోయినయ్. జీవాలు, ఇంటి ముందు ఉన్న బండ్లు నీళ్లలో బతుకమ్మలెక్క కొట్టుకపోయినయ్. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు.

– ఆకుల జగ్గయ్య, రావిరాల



డోర్నకల్ మండలం దుబ్బతండాలో పొలంలో ఇసుక మేటలను చూపుతున్న రైతు



భారీ వర్షాల వల్ల వరదతో కోతకు గురైన కేసముద్రం – ఇంటికన్నె రైల్వే ట్రాక్ (ఫైల్)

## రామప్పలో ప్లేట్ లోడ్ టెస్ట్



ప్లేట్ లోడ్ టెస్ట్ చేస్తున్న అధికారులు

వెంకటాపూర్, డిసెంబర్ 30 : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయం ఉపాలయమైన కామేశ్వరాలయ పునర్నిర్మాణ పనులకు అడుగులు పడుతున్నాయి. సోమవారం కేంద్ర పురావస్తు శాఖ అధికారులు ప్లేట్ లోడ్ టెస్ట్ నిర్వహించారు. ఆలయ నిర్మాణ చేపట్టే ప్రదేశం శిలల బరువును ఎంతమేరకు తట్టుకుని నిలబడుతుందో తెలుసుకోవడానికి ఈ పరీక్ష చేపట్టినట్లు పురావస్తు శాఖ అధికారులు తెలిపారు. 20 నుంచి 100 టన్నుల బరువు గల ఇసుక సంచులతో 5 దశల్లో టెస్ట్‌లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ అజ్మీరా భీమా, డీఈ చంద్రకాంత్, డిప్యూటీ సూపరింటెండెంట్ హెచ్‌ఆర్ దేశాయి, ఏఈలు కృష్ణ చైతన్య, కిషోర్‌కుమార్, సీఏ నవీన్‌కుమార్, గార్డెన్ ఫోర్‌మెన్ ప్రదీప్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏడాదైనా ఆటో డ్రైవర్లకు అందని జీవనభృతి

గిరాకీ లేక జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో ఖాళీగా ఉన్న ఆటోలు

# పొట్టకొట్టి హామీ ఎగ్గొట్టి..

- ఏటా రూ. 12 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలకు తగ్గిన గిరాకీ
- ఈఎంఐలు కట్టలేక.. కుటుంబాలు గడవక అవస్థలు
- ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోని రాష్ట్ర సర్కారు
- అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రస్తావించని పాలకులు
- సర్కారు తీరుపై ఆటో కార్మికుల ఆగ్రహం

కృష్ణకాలనీ, డిసెంబర్ 30: అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్ల పొట్టకొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వారికిచ్చిన హామీని సైతం ఎగ్గొట్టింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలకు గిరాకీ లేక.. ప్రభుత్వం పట్టించుకోక ఆటో డ్రైవర్ల జీవనం అగమ్యగోచరంగా మారింది. ఆటోలు నడవక అనేక మంది కుటుంబాలు గడవడం కష్టమవుతున్నది. ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సంస్థల నుంచీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకంతో తాము రోడ్డున పడ్డామని ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున ఆందోళనలు, రాస్తారోకోలు చేపట్టారు. వీరికి బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుగా నిలిచింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి ఏటా రూ.12 వేల జీవన భృతి ఇస్తామని ప్రకటించింది. ఈ విషయమై అసెంబ్లీ సాక్షిగా మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చి ఏడాదైనా అమలుకు నోచుకోవడం లేదు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో ప్రకటించినా ఆచరణలోకి రాలేదు. సర్కారు సాయం తమ కుటుంబ పోషణ కు ఎలా సరిపోతుందని ఆటో డ్రైవర్లు అప్పట్లోనే ప్రభుత్వంపై మండిపడ్డారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనూ జీవనభృతి విషయాన్ని ప్రస్తావించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఉద్యమాన్ని నీరుగార్చేందుకే మాయమాటలు చెప్పినట్లు ఆరోపిస్తున్నారు.

**కుటుంబాలను పోషించుకోలేని దుస్థితి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సుమారు 1,500కు పైగా ఆటోలున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు నిత్యం వందలాది ఆటోలు నడుస్తుంటాయి. తద్వారా అనేక కుటుంబాలకు ఉపాధి లభిస్తున్నది. గతంలో ఖర్చులన్నీ పోగా రోజుకు రూ. 600 వరకు చేతికి వచ్చేవి. కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండేది కాదు. పిల్లల చదువులు కూడ సక్రమంగా సాగేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఉచిత బస్సు ప్రయాణం తెచ్చాక ఆటోలకు మహిళల ఆదరణ తగ్గింది. గతంలో వచ్చిన డబ్బులో సగం గిరాకీ కూడా ఉండడం లేదని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు రూ. 200 కూడా మిగలడం లేదని, కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నామని వాపోతున్నారు. ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి ఉందని, ఫైనాన్స్ సంస్థల వేధింపులు తట్టుకోలేక కొంతమంది అప్పులు చేస్తున్నారని, మరికొందరు కిస్తీలు కట్టలేక వారికే ఆటోలు ఇస్తున్నారని అంటున్నారు. రాష్ట్రంలో అనేక మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. రాష్ట్ర సర్కారు వెంటనే స్పందించి జీవనభృతి అందించాలని ఆటో కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

### భృతి ఇవ్వకుంటే ఆందోళనలు..



కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. రూ.12 వేల జీవన భృతి ఇస్తామని ఏడాదిగా రాష్ట్ర సర్కారు కాలం గడుపుతున్నది. ఈఎంఐలు కట్టలేక, కుటుంబం గడవక ఆర్థిక ఇబ్బందులతో చనిపోయిన ఆటో డ్రైవర్లున్నారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీని పూర్తిగా మరిచిపోయినట్టు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం జీవన భృతి అందించకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతాం.

–పోలవేణి అశోక్‌కుమార్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు, భూపాలపల్లి

### హామీని నిలబెట్టుకోవాలి



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలకు గిరాకీ ఉండడం లేదు. పొద్దంతా ఆటో తోలినా ఇంటి ఖర్చులకు సరిపోవడం లేదు. కుటుంబాన్ని పోషించుకోవడం భారమైతాంది. పిల్లలను చదవించలేకపోతున్నాం. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా రూ.12 వేల భృతి ఇవ్వడంలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. మంత్రి పొనం గత అసెంబ్లీ సమావేశాల్లో జీవన భృతిపై మాట్లాడతాడని ఆశపడ్డాం. కానీ ఆటో డ్రైవర్ల ఊసే ఎత్తలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం జీవన భృతి ఇవ్వాలి.

– చల్లూరి కాళీ ప్రసాద్, ఆటో డ్రైవర్, గడ్డిగానిపల్లి, భూపాలపల్లి

### కిస్తీలు కట్టలేకపోతున్నాం..



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఫైనాన్స్ మీద ఆటోలు తీసుకున్న వాళ్లం కిస్తీలు కట్టలేక వాళ్లకే వదిలేస్తున్నాం. గతంలో రోజుకు 8 నుంచి 10 ట్రిప్పులు నడిపేవాళ్లం. ఇప్పుడు రెండు ట్రిప్పులు కూడా పడడం లేదు. గతంలో మాట్లాడిన ఇద్దరు మంత్రులు ఇప్పుడు మమ్మల్ని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మాకు జీవనభృతి అందించాలి.

– ఈరవేణి రాధాకృష్ణ, ఆటో డ్రైవర్, భూపాలపల్లి

# 24,905

**టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు ఫైనల్**

- తుది ఓటర్ల జాబితా వెల్లడి
- ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్ !

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ) : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజవర్గానికి సంబంధించిన తుది ఓటర్ల జాబితా విడుదలైంది. మొత్తం 24,905 మంది ఓటర్లతో కూడిన జాబితాను కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గత అక్టోబర్ ఆరంభం నుంచే ఓటర్ల నమోదుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీని ప్రకారం గత నెల 6 వరకు ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. ఈమేరకు నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లాల నుంచి ఓటు హక్కు కోసం మొత్తం 28వేల మందికి పైగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం లేని దరఖాస్తులను తిరస్కరించారు. గత నెల 23న మొత్తం 22,554 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. దీనిపైనా తిరిగి అభ్యంతరాలను స్వీకరిస్తూ ఇదే సమయంలో కొత్తగా దరఖాస్తులకు అనుమతించారు. దీంతో కొత్తగా 2,351 మంది ఓటర్లు పెరిగారు. అనంతరం తుది జాబితాను సిద్ధం చేసి సోమవారం ప్రకటించారు. మొత్తం 12 జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 24,905గా నమోదైంది. అందులో పురుషులు 14,940 మంది, మహిళలు 9,965మంది ఉన్నారు. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 20,888 మంది ఓటర్లుగా ఉన్నారు. ఈసారి అదనంగా 4,017 మంది నమోదు చేసుకున్నారు. ఈ తుది జాబితా ఆధారంగానే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేసి మార్చిలో పోలింగ్ నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి టీఎస్ యూటీఎఫ్‌కు చెందిన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన పదవీ కాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో త్వరలోనే ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ సన్నద్ధవుతున్నది. ఇక పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా గతంలో 181 ఉండగా, ఈసారి 200కి పెరిగింది. అదనంగా 19 పోలింగ్ కేంద్రాలు రానున్నాయి. కాగా, ఇప్పటికే ప్రధాన సంఘాల నుంచి అభ్యర్థులు ఖరారయ్యారు. టీఎస్ యూటీఎఫ్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మరోసారి అభ్యర్థిగా ప్రచారంలోకి దిగారు. పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, టీచర్స్ జాక్ పేరుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మరో సంఘం నుంచి హర్షవర్ధన్‌రెడ్డి ఓటర్లను కలుస్తున్నారు. తుది జాబితా వెల్లడి కావడంతో మరింత ముమ్మరం ప్రచారం చేసేందుకు అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు.

| జిల్లా | పోలింగ్ కేంద్రాలు | ఓటర్ల సంఖ్య |
|---|---|---|
| జనగామ | 12 | 921 |
| హనుమకొండ | 15 | 5,098 |
| వరంగల్ | 13 | 2,225 |
| మహబూబాబాద్ | 16 | 1,618 |
| భూపాలపల్లి | 7 | 323 |
| ములుగు | 9 | 612 |

## రాష్ట్రస్థాయి పోటీలకు జేఎన్‌ఎస్ సిద్ధం

- అథ్లెటిక్స్, రెజ్లింగ్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- పాల్గొంటున్న రెండు వేల మంది క్రీడాకారులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 30 : రాష్ట్రస్థాయి సీఎం కప్ అథ్లెటిక్స్, రెజ్లింగ్ పోటీలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్‌ఎస్)లో మూడురోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు 33 జిల్లాల నుంచి సుమారు రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. సోమవారం మధ్యాహ్నం వరకే వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో స్టేడియం సందడిగా మారింది. రెజ్లింగ్ పోటీలను ఫ్లడ్ లైట్ల వెలుతురులో బాస్కెట్‌బాల్ కోర్టులో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు బాలికల బీసీ, ఎస్టీ వసతి గృహాలు, ప్రాక్టీసింగ్ స్కూల్, జేఎన్‌ఎస్‌లో వసతి సౌకర్యం కల్పించారు. క్రీడాకారులకు ఇబ్బందులు కలగకుండా, పోటీలు విజయవంతంగా పూర్తిచేసేందుకు పలు కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పారాలింపిక్స్ గోల్డ్‌మెడల్ విజేత దీప్తి జీవాంజి, అంతర్జాతీయ క్రీడాకారిణి అగసర నందిని ఈ పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులందరికీ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సీఎంకప్ టీషర్ట్‌ను నిర్వాహకులు అందించారు. కాగా, నగరంలోని క్రీడాకారులు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా యువజన క్రీడల శాఖాధికారి గుగులోత్ అశోక్‌కుమార్ నాయక్ కోరారు. రాష్ట్రంలోనే ఏ జిల్లాలో లేని విధంగా హనుమకొండ జిల్లా క్రీడాకారులకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ట్రాక్ సూట్లు అందించినట్లు ఆయన తెలిపారు.



జేఎన్‌ఎస్‌లో అథ్లెట్ల సందడి



ఏటూరునాగారంలో శిబిరం వద్ద మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

# కాంగ్రెస్‌కు ఓట్లేనా.. సమస్యలు పట్టవా?

- ఎనిమిది రోజులుగా సీఆర్టీలను సమ్మె చేస్తున్నా పట్టించుకోదా?
- వెంటనే వారిని రెగ్యులరైజ్ చేయాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి
- మోకాళ్లపై కూర్చొని సీఆర్టీల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న సీఆర్టీలు

ఏటూరునాగారం, డిసెంబర్ 30: 'గిరిజనుల ఓట్లు మాత్రం కాంగ్రెస్ పార్టీకి కావాలి.. గిరిజన సీఆర్టీల సమస్యలు పట్టవా?, వెంటనే వారిని రెగ్యులరైజ్ చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఎనిమిది రోజులుగా ఐటీడీఏ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న సీఆర్టీల శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖలో సీఆర్టీలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుతల వారీగా వారి వేతనాలు పెంచి ఆదుకున్నదన్నారు. మినిమం టైం స్కేలు ఇవ్వాలని, ప్రతి నెలా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని, మహిళా సీఆర్టీలకు ప్రసూతి సెలవులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. సమస్యలు పట్టించుకోకుంటే సీఆర్టీల కుటుంబాలు కూడా సమ్మెలో పాల్గొనాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు జంపన్న, గడదాసు సునీల్ కుమార్, ఖాజాపా షా, కుమ్మరి చంద్రబాబు, కావిరి చిన్ని కృష్ణ, మందపల్లి సాగర్, పెంచికల లక్ష్మీనారాయణ, గార ఆనంద్, మాదారి రాంబాబు, ఎంపెల్లి రాజు, అనంత్, తదితరులు పాల్గొన్నారు.

**అర్ధనగ్న ప్రదర్శనతో సమ్మె**

సీఆర్టీలు వారం రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ఐటీడీఏ, ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేకపోవడంతో సోమవారం మోకాళ్లపై కూర్చొని అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్టీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమేశ్వర్, ఉపాధ్యక్షుడు పొడెం రవీందర్, జిల్లా అధ్యక్షుడు కొండా రామయ్య, కార్యదర్శి ధరంసోత్ రాజు, తిరుపతి, హరిలాల్, రాములు, మల్లయ్య, చందు, కిషన్, ప్రతాప్, శ్రీనివాస్, సంపత్, సుధాకర్, సరళ, సరిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త మెనూ అమలేదీ?

- పేరుకే హాస్టళ్ల మెస్ చార్జీల పెంపు
- గురుకుల విద్యార్థులకు అందని నాణ్యమైన భోజనం



ఆత్మకూరు(పరకాల) సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో విద్యార్థులకు వడ్డించిన భోజనం

పరకాల, డిసెంబర్ 28: గురుకులాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో మసకబారుతున్నాయి. చాలా చోట్ల భోజనం వికటించి విద్యార్థులు అనారోగ్యం పాలైన ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఓ పక్క ప్రభుత్వం మెస్ చార్జీలు రెండింతలు పెంచామని గొప్పలు చెప్పుకుంటున్నా మరోపక్క నూతన మెనూ అమలు కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 14 నుంచి ప్రతి గురుకులంలో కొత్త మెనూ ప్రారంభిస్తామని చెప్పినా పకడ్బందీగా అమలు కావడం లేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున వెల్లువెత్తున్నాయి.

**కొత్త మెనూ ప్రకారం అందని భోజనం**

నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం వారంలో రెండు రోజులు నాన్ వెజ్, మిగతా ఐదు రోజుల్లో ప్రతి రోజూ గుడ్డు, పెరుగు, ఓ కూర, టమాట ఆకుకూరతో పప్పు అందించాల్సి ఉంటుంది. సాయంత్రం కూర చట్నీ, సాంబార్, మజ్జిగతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాల్సి ఉంటుంది. చాలా గురుకులాల్లో మధ్యాహ్నం, సాయంత్రం కూర, సాంబార్‌తో విద్యార్థులకు భోజనాన్ని పెడుతున్నారు. పెంచిన డైట్ చార్జీల ప్రకారం.. 7వ తరగతి విద్యార్థులకు గతంలో నెలకు రూ.950 ఉండగా రూ.1330, 8–10వ తరగతి వారికి రూ. 1100 నుంచి రూ.1540, ఇంటర్ నుంచి పీజీ వారికి రూ.1500 నుంచి 2100లకు పెంచారు. నూతన మెనూ అమలు చేయాల్సి ఉన్నా చాలా గురుకులాల్లో పాత పద్ధతిలోనే భోజనాన్ని అందిస్తుండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మల్లక్కపేట, ఆత్మకూరు సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో మెనూ అమలుపై అడిగితే అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రిన్సిపాల్‌ను అడిగితే పిల్లలను టార్గెట్ చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**నిబంధనల మేరకే..**

సొసైటీ నిబంధనల మేరకే నడుచుకుంటున్నా. కలెక్టర్, సొసైటీ కార్యదర్శి ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలోకి రెండో శనివారం మాత్రమే విద్యార్థుల విజిటింగ్ కోసం వారి తల్లిదండ్రులకు అనుమతి ఉంది. మిగతా రోజుల్లో అనుమతి లేదు. దీంతో కొద్దిమంది కావాలని నాపై, పాఠశాలపై విష ప్రచారం చేస్తున్నారు. కొత్త మెనూ ప్రకారం భోజనాన్ని అందిస్తున్నాం.

– కృష్ణకుమారి, ప్రిన్సిపాల్, సోషల్ వెల్ఫేర్ స్కూల్, మల్లక్కపేట, పరకాల

## తుపాకీతో బెదిరింపులు.. ముఠా అరెస్ట్





నిందితుల అరెస్టు, వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 30 : మహబూబాబాద్ జిల్లా పరిధిలో తుపాకీతో తిరుగుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం మానుకోట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు. సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన అందె గోపి, దొంతగాని సందీప్, రాజస్థాన్‌కు చెందిన గోసామి ప్రవీణ్, కేసముద్రం మండలం పెనుగొండకు చెందిన మాధవపెద్ది శ్రీకాంత్‌రెడ్డి, వరంగల్‌కు చెందిన మెరుగు సిద్ధార్థ కలిసి ఒడిశా, రాజస్థాన్ నుంచి గంజాయి తెచ్చి వ్యాపారం చేసేవారు. ఓ గంజాయి కేసులో రాజమండ్రి జైలులో గోపికి రాజస్థాన్‌కు చెందిన ప్రవీణ్, కేరళకు చెందిన జయరాం, ఒడిశాకు చెందిన చంద్రశేఖర్ పరిచయమయ్యారు. తమకు బిజినెస్ పరంగా ఒక తుపాకి కావాలని గోపిని జయరాం, చంద్రశేఖర్ అడిగారు. అతను రాజస్థాన్‌కు చెందిన ఇమ్రాన్ ఖాన్ వద్ద తుపాకి, రెండు తూటాలు ఇప్పించాడు. అనంతరం తుపాకి వద్దని చంద్రశేఖర్ చెప్పడంతో దానిని అమ్మేందుకు కారులో పెట్టుకుని తిరుగుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రూరల్ సీఐ ఆధ్వర్యంలో కేసముద్రంలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న కారును పోలీసులు తనిఖీ చేసి అందులో ఉన్న తుపాకి, రెండు తుటాలు, ఐదు సెల్‌ఫోన్స్, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అందె గోపి, గోసామి ప్రవీణ్, మాధవపెద్ది శ్రీకాంత్ రెడ్డి, దొంతగాని సందీప్, మెరుగు సిద్దార్థను అరెస్ట్ చేయగా ఇమ్రాన్ ఖాన్ పరారీలో ఉన్నాడు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సైలు మురళీధర్, తాహెర్ బాబా, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## కోర్టుకు హాజరైన బీఆర్‌ఎస్, జాగృతి నాయకులు



భూపాలపల్లి కోర్టుకు హాజరై వస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ, జాగృతి నాయకులు

కృష్ణకాలనీ, డిసెంబర్ 30 : భూపాలపల్లి జిల్లా సబ్‌కోర్టుకు సోమవారం బీఆర్‌ఎస్, జాగృతి నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై ఈడీ అక్రమ కేసును నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. దీనిని నిర్వహించినందుకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, 17వ వార్డు కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, నాయకులు బండారి రవి, బేతోజు భరత్‌కుమార్ చారి, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డిపై కేసు నమోదు చేయడంతో వారు కోర్టుకు హాజరయ్యారు.

## అన్నారం బరాజ్ వద్ద వేవ్ టెస్ట్‌లు

మహదేవపూర్(కాళేశ్వరం), డిసెంబర్ 30 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన అన్నారం బరాజ్‌లో చేపట్టిన పారలల్ సిస్మిక్ వేవ్ మెథడ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం పుణే సీడబ్ల్యూపీఆర్‌ఎస్ నిపుణులు ధనుంజయ్ ఆధ్వర్యంలో బరాజ్ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లలో పరిశీలన చేసి పరీక్షలు నిర్వహించారు. జియోటెక్నికల్ అంశాలపై అధ్యయనం చేశారు. తదుపరి రిపోర్టును పుణే కార్యాలయానికి అందించనున్నట్లు వారు తెలిపారు. అక్కడ భారీ నీటిపారుదల శాఖ ఈఈ యాదగిరి, అధికారులు పాల్గొన్నారు.



అన్నారం బరాజ్ వద్ద వేవ్ పరీక్షలు చేస్తున్న పుణే నిపుణులు


